# శిక్ష

సాయంకాలం ఆరుగంటలు కావస్తోంది. పెంకుటింటి వసారాలో కూర్చుని భగవద్గీత చదువుతున్నారు. డెబ్బైయ్యేళ్ళ నాగభూషణంగారు నాగభూషణం గారి భార్య సుందరమ్మ అప్పటివరకూ అక్కడే కూర్చుని భర్త చదివి అర్థం చేప్పే భగవద్గీత వింటూన్నదల్లా మెల్లగా లేచి లోపలికి నడుస్తూ.

కాస్సేపు ఆపండి తులసి దగ్గర సంధ్య దీపం వెలిగించి వస్తాను అంది. అలాగే నంటూ పుస్తకం మూసి పక్కన పెట్టి కళ్లజోడు తీసి కళ్ళు గట్టిగా మూసుకుని కుర్చీలో వెనక్కి వాలాడు.

నాగభూషణంగారు పదియెకరాల మాగాణీ పొలం వున్న రైతు. ఆ భూదేవినే నమ్ముకుని సొంత సేద్యం చేసుకుంటూ ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశారు ఇద్దరమ్మాయిలూ సుఖంగా కాపురం చేసుకుంటూ అప్పుడప్పుడూ వచ్చి తల్లిదండ్రులని చూసినాలుగు రోజులు వుండి వెళ్లిపోతుంటారు. ఇంక కొడుకు వేణు ఎం.కాం. పాసైనా వుద్యోగ ప్రయత్నం చేయలేదు.

“బస్తీ జీవితం నాకు ఒద్దు నాన్నా! నీలానే వ్యవసాయం చేస్తాను” అంటూ పల్లెటూరి రైతు అయ్యాడు. వేణు భార్య నళినికి ఈ పల్లెటూరి జీవితం అంటే పరమబోరు. పెళ్లి ఖాయం చేసుకుంటున్నప్పుడు అందగాడూ ఆస్తిపరుడూ ఒకే ఒక్క కొడుకూ ఎం.కాం. చదువుతున్నాడు అని ఇష్టపడి ఈ సంబంధానికి ఒప్పుకుంది. కానీ వేణు పట్నవాసంలో వుద్యోగం చేయకుండా యిలా రైతుగా మారతాడని కలలో కూడా అనుకోలేదు. ఈ నిజం తెలుసుకున్నప్పుడు గుండె చెరువయ్యేలా ఏడ్చింది. అలిగింది.

పుట్టింటికి వెళ్లి ఆరునెలలు వుండిపోయింది. అయినా వేణు తన నిర్ణయం మార్చుకోలేదు. మార్చుకోడని తెల్సిన తర్వాత గత్యంతరం లేక తిరిగి అత్తవారింటికి వచ్చింది. కానీ శాంతిగా వుండలేదు.

భార్యని అన్ని విషయాలలోనూ యెంతో ప్రేమగా చూస్తాడు వేణు. ఈ ఒక్క విషయంలో మాత్రం వినడుగాకవినడు. విశాలమైన ఇల్లు, పెరట్లో యెన్నో చెట్లూ పాడీపంటా టివీ, రేడియో ఇలా యెన్ని సౌకర్యాలున్నా సంతృప్తి లేదు. నళినికి వేణుకి తల్లి దండ్రులంటే గౌరవం. తండ్రిలోని నిజాయితీనీ దయనీ ధర్మాన్నీ చూసి గర్వపడతాడు. తనూ ఆదారినే నడవటానికి ప్రయత్నిస్తాడు. ఇంక నాగభూషణంగారి భార్య సుందరమ్మకి భర్త చెప్పిన మాట వేదం. ఇల్లే ఆవిడ దేవాలయం. భర్తే ఆవిడ దైవం. ఆ ఇంట్లో యెందరో చుట్టాలు బాధల్లోనూ కన్నీళ్లతోనూ వచ్చి సేదదీరి ఓ ఆసరా సంపాందించుకుని వెళ్లిపోయారు. అయితే వృద్ధుల వుదార హృదయాల వల్ల పంటపొలం పదెకరాల్లోంచి నాలుగు యెకరాల్లోకి వచ్చేసిందని కోడలు నళినికి ఒళ్లుమంట. వేణు పొలం, వ్యవసాయమే గాక పాడిగేదెలని నాలుగు కొని వాటిమీద కూడా డబ్బు సంపాదిస్తూ యింకా యీ వూళ్లోనే వుండి డబ్బు సంపాదించేందుకు మార్గాలు ఏం వున్నాయో అని అనుక్షణం ఆలోచిస్తూనే వుంటాడు.

నాగభూషణంగారికి కొడుకు వ్యవసాయం చూసుకోవటంతో కాస్త విశ్రాంతి చిక్కిప్రశాంతంగా కాలం వెళ్లదీస్తూ ప్రతి సాయంకాలం ఓ గంట భగవద్గీత చదివి భార్యకి అర్థం చెప్పటం ఆయన దినచర్యలో ఒకభాగం అయింది. అలాగే ఈ రోజూ భగవద్గీత పారాయణం ముగించేయబోతుండగా సుందరమ్మ సంధ్య దీపం వెలిగించి వస్తానని లోపలికి వెళ్లటంతో ఆయనకి విశ్రాంతి చిక్కింది ఆయన అలా కళ్లుమూసుకుని పడుకుని వుండగానే...

ఓ పది పన్నెండేళ్ల కుర్రాడు "తాతయ్యా" అంటూ తుఫానులా వచ్చి ఆయన కాళ్లను చుట్టుకుని బావురుమన్నాడు.

"ఎవర్రా నువ్వూ! నీకేం కష్టం వచ్చిందిరా" అంటూ నాగభూషణం గారు ఆ కుర్రాడిని లేవనెత్తుతూ అడిగారు.

కుర్రాడు ఏడుస్తున్నాడే కానీ నోట్లోంచీ ఒక్కమాట రావటం లేదు.

ఇంతలో సుందరమ్మ అక్కడికి వచ్చింది ఆకుర్రాడిని గుర్తపట్టింది.

"అరె బిచ్చూ యేమైందిరా! అంది ఆదుర్దాగా

"వీడు బిచ్చూగాడా!" కళ్లజోడు పెట్టుకుంటూ అన్నారు నాగభూషణంగారు.

"అవునండీ నాగరత్నమ్మ కొడుకు బిచ్చూగాడే పాపం నాగరత్నమ్మ మొగుడు పేకాటకీ తాగుడుకీ అప్పులు చేస్తే వాళ్లు ఆ పొలం ఇల్లూ లాక్కుని వీళ్ళని వెళ్లగొడితే యీవూళ్లో బతలేక బస్తీ చేరి వంటలు చేసి ఆపక్షవాతం వచ్చిన మొగుడిని నాలుగేళ్లు బతికించుకుంది. కానీ ఆ దేవుడు ఆ మొగుడిని ఎత్తుకుపోతే లేకలేక పుట్టిన ఈ బిచ్చూ గాడిని పెంచి పెద్ద చేసేందుకు రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదిస్తూ వీడికి ఇంగ్లీషు చదువులు చెప్పించాలని బోలెడంత డబ్బు పోసి కాన్వెంటులో చేర్పించి చదివిస్తుందండీ. మొన్నామధ్య మనవూరివాళ్లకి బస్తీలో కనిపించి చెప్పిందట"

"అలాగా"

బిచ్చూ ఏడుస్తూనే ఈమాటలన్నీ విని మళ్లీ గొంతుపెద్దది చేశాడు.

"మా అమ్మ..... మా అమ్మ తాతయ్యా" అంటున్నాడు వెక్కిళ్లు పెడుతూ.

"కారు యాక్సిడెంటులో మా అమ్మ చచ్చి పోయింది". మళ్లీ బోరుమన్నాడు.

"అయ్యో ఎంత కష్టం వచ్చిందిరా నీకీ చిన్నవయసులో" బాధగా అన్నారు నాగభూణంగారు.

తాతయ్యా అమ్మని దహనం చేయటానిక్కూడా నా దగ్గర చిల్లిగవ్వలేదు" మళ్లీ ఎక్కిళ్లు పెట్టసాగాడు బిచ్చూ.

"ఔనా! అంత బస్తీలోనూ శవదహనానికి కూడా దానం చేసే దాతలు లేరా" బాధగా అడిగారు.

"లేరు" ఏడుపు మానేసి తాతగారి ముఖంలోని భావాలని గమనించసాగాడు బిచ్చూ.

"బిచ్చూ మీ అమ్మ వంటలు చేసిన యిళ్లకి వెళ్లి అడక్కపోయావా" సుందరమ్మ అంది.

"వెళ్లాను. వంటలు చేసినందుకు డబ్బు అప్పుడే యిచ్చాం ఇంక మాకేం సంబంధం లేదు అన్నారు."

"వూ" అంటూ లేచి లోపలికి వెళ్లారు నాగభూషణంగారు.

కోడలు నళిని కిటికీలోంచి ఇదంతా చూస్తూనే వుంది. ఆమె ముఖం ఎర్రబడింది కోపంతో.

నాగభూషణంగారు పెట్టె తెరిచి వందరూపాయల కాగితాలు అయిదు తెచ్చి బిచ్చూ చేతిలో పెట్టారు.

"ఈ అయిదు వందలు కర్మకాండలకి చాలవురా. పది వూళ్లోకి వెళ్లి నలుగురికీ చెప్పి ఇంకా ఏమన్నా పైకం వచ్చేలా చూస్తాను" అంటూ భుజం మీద ఓ తువ్వాలు వేసుకుని చెప్పులు తొడుక్కుని బిచ్చూని చెయ్యి పట్టుకుని నడిపించుకుంటూ ప్రహరీ గోడ దాటి నాలుగు అడుగులు వేశారు.

"వేణు వుదయం బస్తీకి పనిమీద వెళ్లి తిరిగి వచ్చి స్కూటర్ దిగాడు. "ఎవరు నాన్నా ఆ కుర్రాడు! ఎక్కడికి వెడుతున్నారు!!" అడిగాడు.

"వీడు నాగరత్నమ్మ కొడుకు బిచ్చూరా! పాపం వీడి అమ్మ నిన్న కారు యాక్సిడెంట్‌లో చచ్చిపోయిందిట. శవదహనానికి కూడా డబ్బులేదట పాపం నాగరత్నమ్మ మనవూరి మనిషి కదా నాయనా! అందుకనీ" నాగభూషణం మాట పూర్తి చేయకుండానే బిచ్చూ మళ్లీ ఏడుపు అందుకున్నాడు.

వేణు ముఖం క్షణం అదోలా అయింది. నాగభూషణం గారు బిచ్చూ భుజం చుట్టూ చెయ్యివేసి నడిపించుకు వెడుతున్నారు.

"నాన్నా ఆగండి" పిలిచాడు వేణు

"ఏమిటి నాయనా! నేను అయిదువందలే యివ్వగలిగానురా! నువ్వు ఏమైనా ఇస్తావా?"

బిచ్చూ కళ్లలో ఆశ తళుక్కుమంది. దాన్ని వేణు గమనించాడు. ఆశగా చెయ్యి చాచిన బిచ్చూని చెంపలు ఛెళ్ ఛెళ్ మనిపిస్తూంటే నాగభూషణం గారు తేరుకుని బిచ్చూని దగ్గరికి లాక్కుంటూ కోపంగా "వేణూ! ఏమిటిది! తల్లి పోయి ఈ పసివెధవ ఏడుస్తూంటే చేతనైన సాయం చేయవల్సిందిపోయి చావగొడతావెందుకూ" పెద్దగా అరిచారు.

అప్పటికే అక్కడ చాలా మంది పోగైనారు. "నాన్న, నాగరత్నమ్మ పిన్ని గంటక్రితం నాకు బస్తీలో హోటలు దగ్గర కన్పించి చెప్పింది. ఏమనో తెల్సా! వీడు ఆవారాగాళ్లతో చేరి, స్కూలు మానేసి సినిమాలు హోటళ్లూ మరిగి ఆవిడ రెక్కలు ముక్కలు చేసుకుని వీటి భవిష్యత్తు కోసం దాచిన డబ్బు యెత్తుకు పోయి యిప్పటికి నెలరోజుల నుంచీ ఇంటికి రావటం లేదని చెప్పింది. అంతేకాక మా అమ్మ చచ్చిపోయిందని అబద్ధం చెప్పి డబ్బు పోగు చేసుకుని ఆ డబ్బుని యిష్టం వచ్చినట్లుగా ఖర్చు చేయటం అలవాటుగా మారిందని కూడా చెప్పింది. ఎప్పుడైనా మనవూరు వస్తాడనీ, వస్తే వాడి మాటలు నమ్మవద్దనీ చెట్టుకు కట్టేసి చావబాదమనీ వాడికి బుద్ధి వచ్చేలా చేయమనీ

కన్నీళ్ళు పెట్టుకుంటూ చెప్పింది. ఇంక వీడిని దారికితేవటం తనవల్లకాదనీ, చచ్చాడని ఓ ఏడుపు ఏడుస్తాననీ చెప్పింది. నాన్నా. వీడిని చిన్నప్పుడు చూశాను. ఈ మధ్య చూడలేదు. అందుకే గుర్తుపట్టలేక పోయాను. అంటూ బిచ్చూని మళ్లీ బాదసాగాడు. వేణుతో బాటు అక్కడ చేరిన మరికొందరు కొట్టసాగారు. "దొంగవెధవా" అంటూ.

బిచ్చూ ఆ దెబ్బలని భరించలేక పెద్దగా ఏడవసాగాడు.

ఇంత చిన్నవాడు తనంత వృద్ధుడిని ఏడుపుతో మోసగించటం ఆశ్చర్యాన్ని కోపాన్ని కలిగించింది నాగభూషణంగారికి. అయినా అంతలోనే బిచ్చూ హృదయ విదారకంగా ఏడ్చే ఏడుపు ఆ ముసలిగుండెని తాకింది. జాలితో ఓ అడుగు వేసి వాళ్లందరి మధ్య నుంచీ బిచ్చూని బైటికి లాగటానికి ప్రయత్నిస్తూన్న ఆయనకి కూడా నాలుగు దెబ్బలు తగిలినా ఆయన ఖాతరు చేయకుండా వాడి రెక్కపట్టుకుని దూరంగా లాగేశారు.

బిచ్చూ అక్కడ చేరిన అందరూ తనని చంపేసేలా వున్నట్లు గమనించి ఒణికిపోతూ నాగభూషణంగారిని కావులించేసుకున్నాడు.

"తాతయ్యా రక్షించు నన్ను రక్షించు" అంటూ.

ఇంతవరకూ ఏడ్చిన నకిలీ ఏడుపు మాయమై అసలైన దుఃఖం వచ్చేసింది. వాడికి. అది గ్రహించారు నాగభూషణంగారు.

ముసలాయనా నువ్వుండు ఇలాంటి దొంగవెధవని ఒదలకూడదు" సాయంకాలం అయితే చాలు కల్లుపాకలోకి వెళ్లి పీకల దాకా తాగి వచ్చి తన రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించే భార్యని చావబాదే ఓ ప్రబుద్ధుడు రొప్పుతూ అన్నాడు.

"నాయనా దేహశుద్ధికే తమ తప్పులు తెల్సుకునే స్థితిలో మనదేశంలోని మనుషులు వుంటే అన్ని జైళ్లు ఎందుకు? అందరు పోలీసులెందుకు? అన్ని కోర్టులు ఎందుకు? చూడండీ వీడి తప్పుకి 'శిక్ష' మీరంతా వేశారుగా ఇంక నేను వేస్తాను 'శిక్ష' అంటూ వాడి చెయ్యిపట్టుకుని బరబరా ఇంటిలోపలికి లాక్కు వచ్చారు. నాగభూషణం గారు.

"శిక్ష నేనే వేస్తాను" అన్న నాగభూషణం గారి మాటవిని గజగజా వణికిపోతూ. "తాతయ్యా మరెప్పుడూ చెయ్యను. తాతయ్యా మరెప్పుడూ చెయ్యను" అంటూ ఆయన రెండుకాళ్లూ పట్టేసుకున్నాడు.

'ఏమేవ్ వీడి దెబ్బలకి 'కాపడం' పెట్టు అన్నారు.

"ఏ మనిషీ దొంగగా పుట్టడే పరిస్థితులూ పరిసరాలూ స్నేహాలు మనిషిని విజ్ఞుడినీ చేస్తాయి. దొంగవెధవలనీ, ఖూనీకోరులనీ, జూదరులని, తాగుబోతులని, గూండానీ చేస్తాయి. అయితే వీడు చెడు స్నేహాల వల్ల దారి తప్పినా ఆ వాతావరణం నుంచి తప్పించి మన దగ్గర వుంచుకుని చదివిద్దాం. సుమతీ శతకం వేమన, శతకం వగైరా చదివిద్దాం ఇక్కడే స్కూల్లో కూడా చేర్పిద్దాం. మన వేణులా పెంచుదాం. వీడు యీ ఇంటి వాతావరణంలో ఇమిడి మంచి మనిషి అయ్యాడా యీ దేశంలోని దొంగల జనాభాలో ఒక అంకె తగ్గుతుంది. లేదా వారిసంఖ్య మరోటి పెరుగుతుంది. ఇదే నేను వీడికి వేసే శిక్ష నావిధి కర్తవ్యం నిర్వహించటం వరకే. నాగభూషణంగారు బిచ్చుని దగ్గరగా తీసుకుని ప్రేమగా వాడి తల నిమరసాగారు. వాడు యింకా యింకా ఆయన్ని హత్తుకుంటూ ఆయన యిచ్చిన అయిదువందల రూపాయల కాగితాలూ నిక్కరు జేబులోనించి తీసి 'తాతయ్యా' అంటూ ఇచ్చేశాడు.

సుందరమ్మ వేడినీళ్లూ బట్టా తెచ్చింది. దెబ్బలకి కాపడం పెట్టడానికి.

"ఈ ముసలాళ్లు దానం ధర్మం అంటూ చివరికి ఆస్తిలో చిల్లిగవ్వ మిగలనీయరు" మెటికలు విరిచింది నళిని.

(ఈనాడు ఆదివారం 18 డిసెంబరు 1994.)